బలికోరిన డబ్బు!

ముళ్లపూడి నాగేశ్వరరావు

హోటల్ హిల్ మెన్ సాయంత్రం అయ్యేసరికి నీలం రంగును సంతరించుకుని నూతన శోభతో కళకళ లాడుతుంది.

ఆ హోటల్లో చాలవరకు ఇతర దేశాల్నించి వచ్చిన టూరిస్టులు, విశ్రాంతికై వచ్చిన ధనవంతులు నివశిస్తుంటారు. నగరంలో పనికోసం వచ్చిన వారెవరూ అక్కడ దిగరు. కారణం 'హిల్ మెన్' నగరంనుంచి విసిరివేయబడినట్టు నగరం చివర ఎత్తైన ప్రదేశంలో ఉంటుంది.

"అతను ఇంకా రాలేదేమిటి?" అసహనంగా కదిలింది రేఖ. ఆమె ముఖంలో విసుగు ఆత్రుత స్పష్టంగా కనిపిస్తోంది.

రేఖ చాలా అందమయిన యువతి. ఆమె వయస్సు దగ్గరలో ముప్ఫై వున్నా ఇరవై ఏళ్ళ యువతిలా కనిపిస్తుంది. వేసుకొన్న బట్టల్లో దాగని ఆమె ఒంపు సొంపులు మగ వాళ్ళ మతులు పోగొడతాయి. ఆమె వేసుకొన్న పల్చటి నైలాను ఫ్రాకు ఆమె అందాన్ని రెట్టింపు చేస్తోంది.

శ్రీరామ్ చిన్నగా నవ్వేడు. కాలిపోయిన సిగరెట్టు బయటపడేసి కొత్త సిగరెట్ వెలిగించాడు.

గడియారం 6 గంటలు కొట్టింది.

"అతనికి మన రూం నెంబర్ చెప్పావా?"

చెప్పానన్నట్టు తల ఊపేడు శ్రీరామ్. శ్రీరామ్ వయసు ముప్ఫైరెండు సంవత్సరాలు. పచ్చని ఛాయ. మంచి పొడుగ్గా ఉంటాడు. ఆకర్షణీయమైన అతని కళ్ళు ఎప్పుడూ నవ్వుతూ ఉంటాయి.

తలుపుమీద ఎవరో మెల్లగా కొట్టిన చప్పుడైంది. రేఖ ముఖం వికసించింది. శ్రీరామ్ వెళ్ళి తలుపు తీశాడు.

"మీట్ మిస్టర్ వేణు," అంటూ రేఖకి పరిచయం చేసాడు.

"ఐయాం మిస్ రేఖ" తనని తనే పరిచయం చేసుకుంది రేఖ.

"గ్లాడ్ టు మీట్ యూ" అంటూ రేఖతో కరచాలనం చేసాడు వేణూ.

"ప్లీజ్ టేక్ యువర్ సీట్."

ముగ్గురూ కూర్చున్నారు.

శ్రీరామ్ సిగరెట్స్ తీసి మిగిలిన ఇద్దరికీ ఆఫర్ చేసాడు.

"శ్రీరామ్ డ్రింక్స్ ఆర్డర్ చెయ్యి."

డ్రింక్స్ వచ్చాయి. "తీసుకోండి" అంటూ ఓ గ్లాసు వేణూ ముందుకి తోసింది రేఖ.

"నా కలవాటులేదు," మృదువుగా తిరస్కరించేడు వేణు.

"మిమ్మల్ని ఏమైనా చేస్తామని భయమా?"

"నో అలాంటిదేమీ లేదు" అన్నాడు వేణు. అతని దృష్టి ముందు జరగబోయే సంభాషణమీదుంది.

"మీరేం చదివారు?"

"బ్రతకలేని అభాగ్యుడు."

"అదేమిటి?" ఆశ్చర్యంగా అడిగింది రేఖ.

"బి. య్యే" అన్నాడు వేణూ.

"ఇంతకుముందు ఎక్కడ పనిచేశారు?"

"చెప్పలేను. దాని అవసరం ఉండదన్నారు శ్రీరామ్."

"ఐయాం సారీ."

"నెవర్ మైండ్."

వాతావరణం నిశ్శబ్దం అయ్యింది. కొన్ని నిమషాలు ఎవరూ మాట్లాడలేదు.

"మీరు చెయ్యవలసినపని పెద్దదేగాని, చాల సులభమయినది" అసలు విషయాన్ని కదిపింది రేఖ.

"చెప్పండి."

"ఆ పని చేసినందుకు మీకు పదివేలిస్తాం. డబ్బు విషయంలో మనకు ఒప్పందం కుదిరితే తరవాత మిగిలిన విషయాలు మాట్లాడుకోవచ్చు," అంది రేఖ.

వేణు ముఖం వెలిగింది.

"ఒకే. నాకు ఇష్టమే చెప్పండి!"

రేఖ చేతులో ఉన్న సిగరెట్ విసిరేసి కొత్తది వెలిగించింది.

"మీకు లక్షాధికారి రామచంద్రం తెలుసా?"

వేణు తెలుసన్నట్టు తల ఊపేడు.

"మేము అతని ఇల్లు దోచుకుందామనుకుంటున్నాము.

మంచి ప్లానుకూడా వేసాము. ఆ ప్లాను ఫలించాలంటే మీరు ఏ పనిమనిషిగానో ఆ ఇంట్లో ప్రవేశించి, మాకు అక్కడ పని సానుకూలం చెయ్యాలి,'' ఆగింది రేఖ.

''నేనేం చెయ్యాలి?''

''మేము పద్దెనిమిదవ తారీకు రాత్రి 12 గంటలకి దొంగతనం చెయ్యాలనుకుంటున్నాము. కాబట్టి మీరు అక్కడున్న అడ్డంకుల్ని తొలగించాలి.''

''ఆ అడ్డంకులు ఏమిటి?''

''రామచంద్రం ఇంటిని ఒక నైట్ వాచ్ మెన్, ఒక అల్సేషియన్ కుక్క కాపలా కాస్తాయి. మీరా పద్దెనిమిదవ తారీకు రాత్రి ఆ ఇద్దర్నీ అక్కడనుంచి తొలిగించాలి. ఆ పని చేయగలరా?''

''చేస్తాను'' అన్నాడు వేణు.

''ఒకవేళ మీరు ఆ అడ్డంకుల్ని తొలిగించలేకపోతే మాకు ముందుగా ఫోన్ చేసి చెప్పండి.''

''అలాగే'' అన్నట్టు తల ఊపేడు వేణు.

''రేఖ ఒక విషయం చెప్పడం మర్చిపోయింది. అదేమిటంటే ఆ రోజు రాత్రి మీరు రామచంద్రం భోజనంలోను, అతని కూతురు భోజనంలోను మత్తుమందు కలపాలి. ఇదిగో ఆ మత్తుమందు''అంటూ ఒక పొట్లం అందించేడు శ్రీరామ్. వేణు తీసి జేబులో వేసుకున్నాడు.

''ఇదిగో మీ ఎడ్వాన్సు రెండువేలు'' నోట్లకట్టలు వేణూవైపు తోసింది రేఖ.

''మీరు ఏ పరిస్థితుల్లోనైనా పోలీసులకి పట్టుబడ్డా మా విషయం చెప్పకూడదు,'' అని హెచ్చరించింది రేఖ.

''నాకు తెలుసు'' అంటూ చిన్నగా నవ్వాడు.

''నేనింక వెళతాను'' అంటూ లేచాడు వేణు.

''ఓకే, విష్ యు బెస్ట్ ఆఫ్ లక్,'' అంది రేఖ.

"సేమ్ టూ యూ."

2

నగరం కోలాహలంగా వుంది. వీధిలో ట్యూబ్ లైట్లు చీకటిని పారద్రోలుతున్నాయి. వేణు మెరుకుగా నడుస్తున్నాడు. వీధిలైటు దగ్గిర ఆగి జేబులోంచి చిన్న అద్దం ముక్క తీసి ముఖం చూసుకున్నాడు. అతని పెదాలమీద సన్నటి నవ్వు విరిసింది.

అతని వేషమంతా మారిపోయింది. తైల సంస్కారం లేని జుట్టూ, దుబ్బుగా పెరిగిన మీసం, మోకాళ్ళవరకు కట్టిన పంచె, దానిమీద మాసిన తెల్లలాల్చి, అచ్చం పల్లెటూరి గబ్బిలాయిలా ఉన్నాడు.

రామచంద్రం నౌఖరు వెంకయ్య గురించి వేణు చాల భోగట్టా సేకరించాడు.

రామచంద్రం ఇంటిముందున్న కిళ్ళీకొట్టు దగ్గిర ఆగి బీడీలు కొన్నాడు. కిళ్ళీకొట్టు దగ్గరున్న బెంచి మీద కూర్చుని రామచంద్రం ఇంటివైపే తదేకంగా చూడసాగాడు.

దాదాపు ఒక అరగంట గడిచిన తరవాత అతని నిరీక్షణ ఫలించింది. రామచంద్రం ఇంటి ముందుభాగంలో లైటు వెలిగింది. కారు స్టార్టు చేస్తున్న చప్పుడయ్యింది. వేణు మెల్లగా ఇంటివేపు వెళ్ళాడు.

"వెంకయ్యా, నే వెళుతున్నాను తలుపేసుకో!"

కారు వెళ్ళిపోయింది. రెండు నిమషాలయిన తరువాత వెంకయ్య ఇంట్లోంచి వచ్చాడు. వేణు వెంకయ్యకేసి చూడసాగాడు. వెంకయ్యకూడా వేణుకేసి చూసాడు.

"వెంకయ్యా," చిన్న కేక వేసాడు వేణు.

"ఎవరు!" అన్నాడు వెంకయ్య.

"నువ్వు కట్టెల సిమ్మాద్రి కొడుకు వెంకయ్యవేనా?"

"అవును. ఇంతకీ నువ్వెవరు?"

"నేను చంద్రాన్ని. ఈరయ్యతాత కొడుకుని," అన్నాడు వేణు.

"ఏటి చంద్రానివా? చాలా మారిపోయావ్," ఆశ్చర్యంగా అన్నాడు వెంకయ్య.

"మరీ చిన్నప్పుడు మనిద్దరం ఆడుకునేవాళ్ళంకదా."

వెంకయ్య సంతోషానికి పగ్గాలులేకపోయాయి. ఇన్నాళ్ళకి మళ్ళీ తన ఊరివాడిని చూడగలిగానని వాడు చాల ఆనందపడిపోయాడు.

"రారా, లోపలికి రా," అంటూ వేణూని లోపలికి తీసుకుపోయాడు.

ఆ రాత్రి వేణు వెంకయ్యతో భోజనం చెయ్యాల్సి వచ్చింది. భోజనం చేస్తున్నంతసేపూ వెంకయ్య ఒకటే కబుర్లు. చిన్నప్పటి విషయా లనేకం మాట్లాడేడు.

భోజనం అయిన తరవాత ఇద్దరూ వెంకన్న గదిలోకి వెళ్ళి పడుకున్నారు.

"నువ్వు చిన్నప్పుడే ఇంట్లోంచి పారిపోయావ్ గదా! ఇప్పుడేం చేస్తున్నావ్," అడిగాడు వెంకయ్య. వేణు దానికి సమాధానం సిద్ధంగానే వుంచుకున్నాడు.

"అదంతా ఒక పెద్ద కథలే."

"ఏంటో చెప్పు," ఉత్సాహంగా అడిగాడు వెంకయ్య.

"నే నింట్లోంచి పారిపోయానా! ఎక్కడికి వెళ్ళాలో తెలీలేదు. ఏదో కనిపించిన రైలు ఎక్కేశాను. ఒక నాలుగయిదు గంటలయిన తరువాత టికెట్ కలెక్టరు వచ్చి టిక్కెట్టడిగాడు. లేదన్నాను. అది ఫస్టుక్లాసుట. నలభై రూపాయలు కట్టమన్నాడు. లేవన్నాను. నన్ను బయటికి గెంటబోయాడు. అంతట్లోనే ఒక దొరబాబు ఆ డబ్బు తను కట్టి నన్ను తనతో రమ్మన్నాడు. దొర

అంటే సీమదొర. కాదుగాని కాన డబ్బున్నవాడు. ఈ బంగళాలాటివి నాలుగిళ్ళున్నాయి.

అక్కడ నా పనేమిటని అడగవేం? దొరకి వేటలో సహాయం చెయ్యడం. దొర వారానికొకసారి వేటకెళ్ళే వాడు. నా పనేమిటంటే ఒక తుపాకిని, ఒక వేట కుక్కని పట్టుకోవడం. ఆ తుపాకి నీ అంత బరువుండేది.

ఒకసారి ఏమైందంటే, వేటలో దొర ఒక పులిని గుండుతో కొట్టాడు. అది పులికి సరిగ్గా తగలక దొర మీద కురకబోయింది. దొర మళ్ళీ కాల్చేడు. అదీ తగల్లేదు. నేను ధైర్యంచేసి నన్ను పట్టుకోమని ఇచ్చిన తుపాకి దానిమీదకి ఇసిరాను. అది నాకేసి చూసింది. ఈలోగా దొర దాన్ని కొట్టేశాడు. అప్పుడు దొర నన్ను ఎంత మెచ్చుకున్నా డనుకున్నావు? అప్పట్నించీ దొర నన్ను ప్రాణంగా చూసుకునేవాడు.

అయితే, నా కర్మకొద్దీ ఆర్నెల్లక్రితం దొరని పోలీసులు పట్టుకుపోయారు. నాకు భయంవేసి పారిపోయొచ్చేసేను. అప్పట్నుంచి నౌఖరీకోసం వెతుకుతున్నాను."

వెంకయ్య వేణు కథంతా నమ్మేడు.

"నాకు మా వూరు ఎళ్ళాలని ఉందిరా," అన్నాడు వెంకయ్య.

"వెళ్ళు."

"ఎలాగ దొర ఒప్పుకోడు."

"నేనుంటాను నీ బదులు."

"నిజంగా?"

"నిజంగా."

* * *

రామచంద్రం పొగ గుప్పున వదిలాడు.

"ఏమిటి వెంకయ్యా నాతో చెప్పాలంటున్నావ్?"

"చిత్తం. తమరి దయ అయితే నేను మా ఊరోసారి వెళదామని."

"ఎలాగ వెంకయ్యా నువ్వు లేకపోతే ఇంట్లో ఏ పనీ జరగదే" ప్రశ్నార్థకంగా ముఖంపెట్టాడు రామచంద్రం.

"చిత్తం. అందుకే మా వోణ్ణొకణ్ణి కుదిర్చానండి. ఒరేయ్ చంద్రం ఇలారా," అంటూ వేణుని కేకేశాడు.

వేణు వచ్చి "గుడ్ మోర్నింగ్ సర్," అన్నాడు.

వెంకయ్య, వేణు గురించి అంతా చెప్పాడు.

"సరే అతనికి మన ఇంటి పనులన్నీ చెప్పు" అని ఆజ్ఞాపించి వెళ్ళిపోయాడు.

పనులు జాగర్తగా చెయ్యమని మరీమరీ చెప్పి వెళ్ళిపోయాడు వెంకయ్య.

3

ఆ రోజే పద్దెనిమిదవ తారీకు.

రాత్రి పదయ్యింది!

నైట్ వాచ్ మెన్ శ్రీరాములు ఆవలించి కూర్చున్న చోటినుంచి లేచాడు. నిక్కరు జేబులో చెయ్యెట్టి చూసుకున్నాడు. బీడీలయిపోయాయి. జేబులో డబ్బులు కూడా లేవు.

"ఛస్, ఎదవ బతుకు" అనుకున్నాడు శ్రీరాములు.

"ఏటిరా బాబూ అనుకుంటున్నావు," అంటూ అక్కడికి వచ్చాడు వేణు.

"ఏటి నువ్వు నిద్దరోలేదా?"

"అప్పుడే నిద్దరేటి?" అంటూ ఒక సిగరెట్ వెలిగించి శ్రీరాములుకోటిచ్చాడు. వాడు ఆత్రంగా తీసుకున్నాడు.

ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

"నీకు మందుకొట్టే అలవాటుందా?" అడిగాడు వేణు.

"అదిలేంది ఎవరికిలే," శ్రీరాములు పెదవి విరిచాడు,

"చూడు శ్రీరాములు, అలా ఈరయ్యగాడి కొట్టుకెళదామా!"

శ్రీరాములు ముఖం వెలిగింది. కారణం అక్కడ ఒకటోరకమైన మందు అమ్మబడుతుంది.

"నా దగ్గర డబ్బులేవు" మొహమాటపడ్డాడు.

"పర్లేదులే! మనలో మనకేమిటి?" అంటూ లేచాడు వేణు.

ఇద్దరూ గేటుదాటి బయటకొచ్చారు.

"ఉండు. ఇప్పుడే వస్తాను" అంటూ లోపలికెళ్ళాడు వేణు. కుక్కమందు మత్తుమందు కలిపిన బిస్కట్లుపడేసి, పది నిమషాల్లో సారాకొట్టు చేరుకున్నాడు శ్రీరాములుతో.

4

శ్రీరామ్ ముఖం వెలిగింది. ఎదురుగుండా నోట్లకట్టలు ఒకదాని మీదొకటి పేర్చి ఉన్నాయి.

శ్రీరామ్ బ్రీఫ్ కేస్ తెరిచి నోట్లకట్టలు పేరుస్తున్నాడు. ఉలిక్కిపడ్డాడు శ్రీరామ్.

దబ్, దబ్ దగ్గరలోనే ఏదో పెద్ద శబ్దం వినిపించింది.

శ్రీరామ్ చటుక్కున ఐరన్ సేఫ్ మూసేసేడు.

దగ్గరలోనే ఎవరిదో అడుగులచప్పుడు. శ్రీరామ్ ఒక్కసారి కంపించేడు. మరుక్షణం తేరుకున్నాడు. జేబులోంచి కత్తితీసి పట్టుకున్నాడు.

అడుగుల చప్పుడు ఆగింది. తలుపు ఎవరో మెల్లగా తోసారు. ఎలక్ట్రిక్ లైటు వెలిగింది. గదిలో ఉన్న చీకటి పారిపోయింది.

ఎదురుగా ఉన్న ఆగంతకుణ్ణి చూసి అరవబోయాడు రామచంద్రం. శ్రీరామ్ ధైర్యాన్ని చిక్కబట్టుకున్నాడు. రామచంద్రానికి ఆ అవకాశం ఇవ్వలేదు. పులిలా ముందుకి దూకి కుడిచేత్తో నోరుమూసేడు, ఎడంచేతిలోని కత్తి

రామచంద్రం వీపులో దిగింది బలంగా. మెరుపు మెరిసి మాయమైంది.

రామచంద్రం నిర్జీవంగా నేలమీద పడిపోయాడు.

రక్తం. గ్లవుసెస్ నిండా రక్తం! శ్రీరామ్ వణికి పోయాడు.

5

ఆర్కెస్ట్రా మందంగా వినిపిస్తోంది. స్టేజిమీద రీటా అర్ధనగ్నంగా నాట్యం చేస్తోంది. అనేక జంటలు నృత్యం చేస్తున్నాయి.

రేఖ గ్లాసులోని విస్కీ అయిపోయింది. సీసాలోంచి గ్లాసులోకి వంచుకుంది. సోడా కలపలేదు. గటగటా త్రాగేసింది. శ్రీరామ్ గ్లాసులోని విస్కీని కొద్దికొద్దిగా రుచి చూస్తున్నాడు. కాని అతని దృష్టి అక్కడ లేదు.

స్టేజిమీద నాట్యం తారాస్థాయి నందుకుంది. రీటా వంటిమీద దుస్తుల్ని ఒకదానితరవాత ఒకటి వొలిచేస్తోంది. ప్రేక్షకులు ఈలలు వేస్తూ అరుస్తున్నారు.

"రామ్, డాన్స్ చేద్దాంరా" ఆహ్వానించింది రేఖ.

శ్రీరామ్ మాట్లాడలేదు.

లైట్లు డిమ్మయ్యాయి.

"ప్లీజ్!" రేఖ అభ్యర్థించింది.

"రేఖా! దయచేసి నన్ను బలవంతం పెట్టకు" విసుక్కున్నాడు శ్రీరామ్. రేఖ ఆశ్చర్యపోయింది.

"రామ్! ఏమిటంత డల్‌గా ఉన్నావు?"

శ్రీరామ్ మాట్లాడలేదు.

"ప్లీజ్, నాతో చెప్పవూ!"

"రేఖా! నాకేదో భయంగా ఉంది."

"ఎందుకా భయం? పోలీసులు మనని చచ్చినా పట్టుకో

లేరు,'' శ్రీరామ్‌కి ధైర్యం చేకూర్చడానికి ప్రయత్నించింది రేఖ.

''పోలీసుల గురించి నా కెప్పుడూ భయంలేదు''అంటూ ఆగిపోయాడు శ్రీరామ్. ఇద్దరి మధ్య నిశ్శబ్దం రాజ్యం చేసింది.

''రేఖా! అనవసరంగా హత్య చేశానేమో?''

''డోంట్ బీ సిల్లీ రామ్! నువ్వనవసరంగా భయపడుతున్నావు.''

''అనవసరం కాదు రేఖా! నా కిప్పుడు అనుమానంగా ఉంది. రామచంద్రాన్ని హత్య చేస్తున్నప్పుడు ఏవో లైట్లు వెలిగి ఆరేయేమోనని.''

''అదంతా నీ భ్రమ. ఒక వేళ ఫోటోలు తీస్తే నువ్వప్పుడే గమనించేవాడివి.''

శ్రీరామ్ మాట్లాడలేదు. అతనికి ధైర్యం చిక్కటంలేదు.

''రేఖా మన హోటల్‌కి పోదాం.''

రేఖ మాట్లాడలేదు.

''ప్లీజ్. రేఖా.''

''ఓకే!''

ఇద్దరూ బయటికి వచ్చేరు. ఎవరూ వీరిని గమనించలేదు. గమనించినా పట్టించుకోలేదు.

పోర్టికో వివిధ రకాలయిన కార్లతో నిండి వుంది. నగరంలోని పెద్ద మనుషులు రాత్రి అయ్యేటప్పటికి అక్కడికి చేరుకుంటారు. శ్రీరామ్ నల్ల ఎంబాసిడర్ కారు తాళాలు తీసాడు.

శ్రీరామ్ కారు స్టార్ట్ చేస్తుంటే ఒక కుర్రాడొచ్చి ఒక కవర్ అందించాడు.

''ఎవరిచ్చారు?'' కఠినంగా ప్రశ్నించాడు శ్రీరామ్.

''అ బాబెవరో ఈ కవర్ మీ కిమ్మని ఇచ్చారు''

భయంభయంగా చెప్పాడా కుర్రాడు.

"మమ్మల్నెలా గుర్తుపట్టావు" అడిగింది రేఖ.

"మీ కారు చూపెట్టి ఆ కారులో ఎక్కిన వారికిమ్మన్నాడా బాబు."

శ్రీరామ్ మాట్లాడకుండా కారుని ముందుకుపోనిచ్చాడు. కారు హోటల్ హిల్ మెన్ ముందు ఆగింది.

రూమ్ కెళ్ళిన తరువాత కవర్ తెరిచాడు శ్రీరామ్. తెల్లటి కాగితంమీద ఎర్రటి అక్షరాలు.

"మిస్టర్ శ్రీరామ్,

పిల్లి కళ్ళు మూసుకుని పాలుతాగుతూ ఎవరూ చూడలేదనుకుంటుంది. నువ్వుకూడా అలాగే అనుకుని ఎవరూ చూడకుండా రామచంద్రాన్ని హత్య చేశావు. కొన్ని లక్షలతో పరారయ్యావు. నేరం దాగదు మిస్టర్ రామ్.

రామ్! నువ్వు హత్యచేసినట్టు నిరూపించటానికి నీకు పంపిన ఫోటోలు చాలు. బ్రతికి బయటపడాలంటే, ఒక లక్షరూపాయలు తీసుకుని వెంటనే స్మశానం దగ్గరలో ఉన్న దిబ్బ దగ్గరకి రా!"

క్రింద సంతకంలేదు. శ్రీరామ్ ముఖం పాలిపోయింది. ఉత్తరంతోపాటు రెండు ఫోటోలున్నాయి.

వాటిల్లో శ్రీరామ్ రామచంద్రాన్ని పొడుస్తున్నట్టు స్పష్టంగా ఉంది.

"బ్లాక్ మెయిలింగ్!" తనలో తాననుకున్నాడు శ్రీరామ్.

"ఓ మైగాడ్! ఇప్పుడేం చేసేది?" అంటూ తల పట్టుకుంది రేఖ.

శ్రీరామ్ మెదడు చురుకుగా పనిచేస్తోంది.

ఎవరీ బ్లాక్ మెయిలర్? ఎందుకు తనని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు.

"ఇదంతా ఆ వేణుగాడి పనే. రాస్కెల్! ఎంత ద్రోహం చేసాడు."

పళ్ళు పటపట కొరికాడు శ్రీరామ్.

"రామ్! వాడు కోరిన ఆ లక్షా ఇచ్చెయ్యి. పీడ వదులుతుంది," అంది రేఖ.

"రేఖా! ఒకసారితో వదరదు. వాడు నా జీవితాంతం నన్ను వేటాడతాడు. దీనికి ఏదో ఒక పరిష్కారం చూడాలి."

శ్రీరామ్ ఒక పావుగంటసేపు దీర్ఘంగా ఆలోచించాడు.

"రేఖా! ఆ బ్రీఫ్ కేసులో ఒక లక్షరూపాయలు సర్దు" అంటూ డ్రస్సవడం ప్రారంభించాడు.

6

శ్రీరామ్ పూర్తిగా నల్ల దుస్తుల్లో ఉన్నాడు. అతను చాల త్వరగా నడుస్తున్నాడు. ఒక చేతిలో బాటరీలైట్, ఇంకో చేతిలో బ్రీఫ్ కేస్.

ఊరు చివరికి వచ్చేశాడు. ఇంకో ఫర్లాంగు ఉంటుంది దిబ్బ. శ్రీరామ్ ఒక కొట్టుదగ్గర ఆగేడు. గోల్డుఫ్లేక్ సిగరెట్లు రెండు కొని వాణ్ణి మాటల్లో దింపాడు.

"ఇంతకుముందు ఎవరేనా ఇలా వెళ్ళేరా?" అని కొట్టు వాణ్ణి అడిగేడు శ్రీరామ్.

"వెళ్ళేరు బాబూ."

శ్రీరామ్ ముందుకి కదిలేడు.

చీకటి భయంకరంగా అల్లుకుని ఉంది. శ్రీరామ్ బాటరీ లైటు దాన్ని సన్నగా చీలుస్తోంది. కీచురాళ్ళ రొద చిరాకు కలిగిస్తోంది. ఉండుండి నక్కల అరుపులు వాతావరణాన్ని మరింత భయంకరంగా చేస్తున్నాయి.

శ్రీరామ్ ఆగాడు. బ్రీఫ్ కేస్, బాటరీలైటు నేలమీద పెట్టి సిగరెట్ వెలిగించాడు.

ఎముకలు కొరికేలా చలి వేస్తోంది. శ్రీరామ్ ముందు జరగబోయే దానిగురించి ఆలోచిస్తున్నాడు.

ఎక్కడో అలికిడి అయినట్టయింది. శ్రీరామ్ బాటరీ లైటు అన్ని వేపులకి తిప్పాడు. ఏదో ఆకారం పొదల చాటుకి తప్పుకుంది.

గుండె దిటువు చేసుకుని ముందుకి కదిలేడు.

దిబ్బ ఎగుడు దిగుడులుగా ఉంది. శ్రీరామ్ జాగ్రత్తగా నేల చూసుకుంటూ నడుస్తున్నాడు. నేలమీద సగం కాలిన సిగరెట్ పీక పడిఉంది.

శ్రీరామ్ కళ్ళు చికిలించాడు. అతని ముఖం మీద బాటరీలైటు ఫోకస్ చెయ్యబడింది.

"వెల్ మిష్టర్ శ్రీరామ్!"

శ్రీరామ్ తలెత్తి చూసాడు. ముఖం మీద లైటు పడుతోంది. ఎదురుగా ఏముందో కనిపించడం లేదు.

"శ్రీరామ్ ఆ పెట్టె నేలమీద పెట్టి తెరు. పిచ్చిపిచ్చి వేషాలు వేశావంటే కాల్చేస్తాను," కరుగ్గా పలికింది వేణూ కంఠం.

"వేణూ, నన్నింత మోసం చేస్తావనుకోలేదు," పళ్ళు పట పట కొరికేడు శ్రీరామ్.

ఫక్కుమని నవ్వేడు వేణూ.

"నేరస్తులలో నిజాయితీ ఎలా ఉంటుంది శ్రీరామ్! ద్రోహం తప్ప," అన్నాడు వేణు.

"ఎంత డబ్బు దొరికింది ఐరన్ సేఫ్‌లో?" అడిగేడు మళ్ళీ వేణు.

"లక్ష."

"అబద్ధం" కరుగ్గా అన్నాడు వేణు.

"నన్ను నమ్మకపోతే నేనేం చెయ్యను."

"నీతో నాకు వాదనెందుకు రేపు పేపర్లో పడుతుందిలే"

అన్నాడు వేణు.

"రామ్! బ్రీఫ్ కేస్ తెరిచి బాటరీ లైటు అందులోకి ఫోకస్ చెయ్యి" ఆజ్ఞాపించాడు వేణు.

శ్రీరామ్ అలాగే చేసాడు.

వేణు దృష్టి రూపాయిల మీదుంది. అదే అదనని గ్రహించాడు శ్రీరామ్. చేతిలో ఉన్న బాటరీ లైటుని వేణు చేతిలోని పిస్టల్ మీదికి విసిరాడు.

పిస్టల్ ఎగిరి దూరంగా పడింది.

వేణు ఉలిక్కి పడ్డాడు. కాని అప్పటికే శ్రీరామ్ అతని మీదకి లంఘించాడు.

కాని వేణు వెంటనే ఎదురుదెబ్బ తీసాడు. బూటు కాలితో శ్రీరామ్ డొక్కలో తన్నాడు. శ్రీరామ్, వేణు మీద పడ్డాడు. ఇద్దరూ నేలమీద పడి దొర్లుతున్నారు. నేలంతా రాళ్ళమయమేమో ఇద్దరి వొళ్ళూ కూడా కొట్టుకు పోయింది. చివరికి శ్రీరామ్, వేణుని అదుపులో పెట్టాడు. వేణు గుండెల మీదకెక్కి కూర్చున్నాడు.

వేణు రొప్పుతున్నాడు. శ్రీరామ్ పిడికిలి బిగించి వేణు ముఖం మీద రెండు సార్లు గుద్దేడు.

వేణుకి స్పృహ తప్పింది.

శ్రీరామ్ టార్చ్ లైట్ వెలగడం లేదు. కాని వేణు చేతిలోంచి క్రింద పడిన టార్చ్ లైట్ మాత్రం వెలుగు తోంది. శ్రీరామ్ ఆ టార్చిలైట్ ని తీసాడు.

టార్చ్ లైట్ వెలుగులో చుట్టూరా పరిశీలించాడు. అతని కళ్ళు మెరిసాయి. వేణు పిస్టల్ నేలమీద పడి ఉంది. ఆ పిస్టల్ ని తీసి ముద్దెట్టుకున్నాడు.

మరుక్షణం ఒక తుపాకి గుండు వేణు గుండెల్లో చోటు చేసుకుంది. చీకటిని చీల్చుకుంటూ రెండు మెరుపులు మెరి సాయి.

శ్రీరామ్ ఈసారి జాగ్రత్త పడ్డాడు. కాంతి వచ్చిన వైపుకు పిస్టల్ని గురిపెట్టి రెండు సార్లు కాల్చాడు.

'అమ్మా!' అన్న కేక వినిపించింది. శ్రీరామ్ వెంటనే ఆ కేక వినిపించిన పొదకేసి పరిగెట్టాడు. అక్కడ ఒక మనిషి నేలమీద పడి కొట్టుకొంటున్నాడు. శ్రీరామ్ ఆలస్యం చెయ్యకుండా అతని జేబులు వెతికాడు. పర్స్, జేబురుమాలు మాత్రం ఉన్నాయి.

పర్స్ తెరిచాడు. ఐదు చిల్లరనోట్లు, కొంత చిల్లర మాత్రం ఉన్నాయి. ఒక ఫోటో ఉంది. బ్యాటరీ లైటు వెలుగులో దాన్ని హతుడి ముఖంతో పోల్చి చూసాడు. రెండూ ఒకలాగే ఉన్నాయి. ఫోటో వెనుక ఎడ్రస్ ఉంది.

హతుడి పేరు సుధాకర్.

శ్రీరామ్ ఆ పర్సుని జేబులో వేసుకున్నాడు. కొంచెం దూరంలో కెమేరా పడి ఉంది. దానికి ముందున్న గాజు లెన్స్ బద్దలయిపోయి ఉంది. దాన్ని తీసి మెడలో తగుల్చుకున్నాడు.

శ్రీరామ్ మళ్ళీ వేణు శవం దగ్గరకి వచ్చి జేబులు వెతికాడు. రెండు ఫోటోలు మాత్రం ఉన్నాయి. అవి శ్రీరామ్ రామచంద్రాన్ని హత్య చేస్తున్నవి!

అవి తీసి జేబులో వేసుకున్నాడు.

శ్రీరామ్ ఆలోచిస్తూ నిలబడ్డాడు తన ఆధారాలు ఏమేనా అక్కడ ఉన్నాయేమోనని. ఏం ఫరవాలేదు అని గుండె దిటవు పరచుకున్నాడు. తనని ఎందుకు అనుమానిస్తారసలు?

వేగంగా ముందుకి కదిలాడు.

'వెధవలు ఇద్దరు చచ్చేరు. ఈ ఇద్దరూ కాదు మరో

పదిమంది వచ్చినా చచ్చి ఉందురు. రాస్కెల్స్! ఈ శ్రీరామ్‌నే మోసం చేద్దామనుకున్నారా?' జేబులోంచి పిస్టల్ తీసి ముద్దెట్టుకున్నాడు.

కెమెరాలోంచి రీలు తీసి జేబులో వేసుకున్నాడు. కెమెరా విసరగలిగినంత దూరం విసిరేశాడు.

7

శ్రీరామ్ చురుగ్గా నడుస్తున్నాడు.అతనిప్పుడు ప్రపంచ విజేతలా ఫీల్ అయ్యాడు.

ఏదీ తిరుగులేదు తనకి.

ఎవరూ అడ్డు రాలేరు.

అడ్డువస్తే ఛస్తారు.

ఇవి శ్రీరామ్ అభిప్రాయాలు.

ఊర్లోకి ప్రవేశించాడు.

కిళ్ళీకొట్టువాడు చూస్తాడేమో? చూస్తే పోలీసులకి గుర్తు చెప్పచ్చు. చూస్తే కాల్చి పారెయ్యాలి. ఇప్పటికి ముగ్గుర్ని చంపేడు. ఇంకా ఎంత మందినేనా చంపెయ్యగలడు తను.

ఈ విధంగా సాగుతున్నాయి శ్రీరామ్ ఆలోచనలు.

కిళ్ళీకొట్టు వాడి అదృష్టమో, శ్రీరామ్ అదృష్టమో లేకపోతే పోలీసుల దురదృష్టమో గాని కిళ్ళీకొట్టు కట్టివేసుంది.

శ్రీరామ్ చకచక నడుస్తున్నాడు. తొందరగా ఏదో ఒక టాక్సీ ఎక్కాలి. హోటల్ చేరుకోవాలి. స్మశానం నగరానికి ఒక చివర ఉంటే, 'హిల్ మెన్' రెండవ చివర ఉంటుంది.

శ్రీరామ్‌కి విసుగు పుట్టింది. అంతట్లోకే ఒక టాక్సీ వస్తూ కనిపించింది. అతని ముఖం వికసించింది. జేబురుమాలు తీసి ముఖం తుడుచుకున్నాడు. నల్లని ఎంబాసిడర్

కారు చీకటిని చీల్చుకుంటూ వస్తోంది.

శ్రీరామ్ దానిని ఆపమని సంజ్ఞ చేస్తాడు. అది ఆగే ప్రయత్నమేమీ చెయ్యలేదు సరికదా, స్పీడు మరింత పెరిగింది. శ్రీరామ్ ఆశ్చర్యపోయాడు. మరుక్షణం అతని ముఖం ఎరుపెక్కింది. కారు అతన్ని దాటింది.

శ్రీరామ్ దాని బాక్ టైర్ గురిచూసి కాల్చాడు. సైలెన్సర్ అమర్చడం వల్ల శబ్దం కాలేదు. టైరు తుస్సుమంది. టాక్సీ ఆగింది.

దాంట్లోంచి ఒకతను గబగబా దిగాడు. అతడు నల్లగా పొట్టిగా ఉన్నాడు. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుని ఉన్నాడు. వళ్ళంతా చెమటతో తడి ముద్దయి ఉంది. మెడలో నల్లటి జేబురుమాలు, దుబ్బ మీసం. చిన్నసైజు దయ్యంలా ఉన్నాడు.

"ఇది ఇప్పుడే చావాలా!" అని విసుక్కుంటూ టైరు మార్చేడు. టైరు మార్చడమయిపోయిన తరువాత కారు వైపు వెళుతుంటే ఏదో రాయి తగిలి క్రింద పడ్డాడు. శ్రీరామ్ నవ్వాడు. అపుడుకాని శ్రీరామ్‌ని చూడలేదు.

"ఎవరు నువ్వు?" కంగారుగా ప్రశ్నించాడు.

"మిస్టర్ నాకో సహాయం చెయ్యాలి," అన్నాడు శ్రీరామ్.

"ఏమిటి?" చిరాగ్గా ప్రశ్నించాడు ఆ మనిషి.

"నన్ను హోటల్ హిల్ మెన్‌కి తీసుకెళ్ళాలి."

అతను మాట్లాడకుండా లేచి బట్టలు దులుపుకున్నాడు.

"వంద రూపాయిలిస్తాను!"

"నాకు కుదరదు."

"పోనీ రెండొందలు."

"వందకాదు వెయ్యిచ్చినా నేనిప్పుడు నిన్ను తీసుకెళ్ళలేను. నాకు అర్జంటు పనిఉంది."

"మిస్టర్!" గర్జించాడు శ్రీరామ్.

అతను కారు తలుపు వైపుకు అడుగు వేశాడు.

శ్రీరామ్‌లో ఆవేశం పెరిగిపోయింది. అతని వేలు ట్రిగ్గర్ని అదిమింది. అతని గుండెల్లోంచి బుల్లెట్ దూసుకు పోయింది. దబ్బున్న నేలమీద పడ్డాడు. జేబులోంచి బాటరీ తీసి అతని మీదకు ఫోకస్ చేశాడు. జేబులు సోదా చేశాడు.

నల్లగా తళ తళ మెరుస్తున్న పిస్టల్!

ఆశ్చర్యపోయాడు శ్రీరామ్. మరుక్షణం తేరుకున్నాడు. ఎవడో దొంగల ముఠా వాడయి ఉంటాడు అనుకున్నాడు. అది తీసి జేబులో వేసుకున్నాడు.

ఆ మనిషిలో చలనం లేదు. శ్రీరామ్ బూటు కాలితో బలంగా తన్నాడు. అతడు దొర్లుకుంటూ రోడ్డు పక్కకు పడిపోయాడు.

మరుక్షణం నల్లని అంబాసిడర్ కారు తారురోడ్డు మీద దూసుకు పోయింది.

కారు ఆగిపోయింది. శ్రీరామ్ క్రిందకి దిగి కారుని పరిశీలించాడు. పెట్రోలు ఇంకా ఏభైమైళ్ళ ప్రయాణం చెయ్యడానికి సరిపడవుంది. శ్రీరామ్‌కి కారుగురించి అట్టే తెలియదు. ఇంజను పనిచేయటంలేదు. మళ్ళీ కారు ఎక్కి స్టార్టు చెయ్యడానికి ప్రయత్నించాడు. కారు స్టార్టు అవ లేదు.

కారు నాలుగు మూలలా పరికించేడు. ఒక పెద్ద పెట్టె మాత్రం వుంది. పట్టుకొని చూసాడు. చాలా బరువుగా వుంది. గాడ్రేజ్ తాళం వేసివుంది. తాళం చెవి ఆ దగ్గర్లో ఎక్కడా లేదు.

'ఏ శవం ఉందో?' అనిపించిం దతనికి.

శ్రీరామ్ కారుదిగి చకచకా నడవసాగాడు. అతని

చేతిలో బ్రీఫ్ కేస్ వుంది.

అతని మనస్సు ఉరకలు వేస్తోంది. ఇంకా సుధాకర్ ఇంటికి వెళ్ళాలి. అక్కడ తనకి సంబంధించిన ఫోటోలను చేజిక్కించుకోవాలి. తరువాత ఎవరికీ తెలియని చోటికి వెళ్ళిపోవాలి.

అతని ఊహలు ఆగిపోయాయి. ఎదురుగుండా ఏదో వాహనం వస్తోంది. శ్రీరామే దాన్ని పోల్చుకున్నాడు. అది...

శ్రీరామ్ గుండెలు గుబగుబలాడాయి. పోలీసులకి తన గురించి ఎలా తెలిసింది? ఎవరో చెప్పి వుంటారు! రేఖ చెప్పిందా? ఇప్పుడు తనేం చెయ్యాలి?

గబుక్కున చేతిలోవున్న సూట్ కేస్ను పక్కనేవున్న పెంటకుప్పలోకి విసిరేశాడు. వేన్ అతన్ని సమీపించింది. అతని దగ్గరకు వచ్చి ఆగింది.

8

"మిస్టర్" ఇన్స్పెక్టరు కంఠం ఖంగుమంది.

"ఈ సమయంలో మీ రిక్కడెందుకున్నారు?" సూటిగా ప్రశ్నించాడు.

"ఓ గర్ల్ఫ్రెండ్ దగ్గర్నించి వస్తున్నాను."

"మీ కేదేనా కారు ఎదురయ్యిందా?"

"లేదు" తడబడలేదు శ్రీరామ్.

"బాగా జ్ఞాపకం తెచ్చుకోండి. నల్లరంగు ఎంబాసిడర్."

"నో. నాకు బాగా జ్ఞాపకం ఉంది. నా కెలాంటి కారు ఎదురురాలేదు."

"మీ పేరు?" అడిగాడు ఇన్స్పెక్టర్. అతని పక్కనున్న సబ్ ఇన్స్పెక్టరు నోట్ చేసుకుంటున్నాడు.

"చంద్రమోహన్" బొంకాడు శ్రీరామ్.

"ఎడ్రస్."

నోటికి వచ్చినదేదో చెప్పాడు. వాళ్ళు నోట్ చేసుకున్నారు.

"రేపొకసారి స్టేషన్‌కి వచ్చి కనిపించండి."

శ్రీరామ్ తల ఊపాడు.

ఇన్‌స్పెక్టర్ వేన్ ఎక్కాడు.

కానిస్టేబిల్ చెయ్యిచాపాడు. శ్రీరామ్ రెండురూపాయిలు తీసి ఇచ్చాడు.

"ఎవరికోసం ఈ వేట?"

"ఎవడో బడా స్మగ్లర్‌ట. బంగారంతో పారిపోతున్నట్టు పక్కవూరునుంచి ట్రంకాల్ వచ్చింది. వాణ్ణి పట్టుకుందామని. తస్సాదియ్యా వాడిదగ్గర వంద కేజీల బంగారం ఉందట," కానిస్టేబుల్ చెప్పుకుపోతున్నాడు.

"టూనాట్ త్రీ!" వేన్‌లోంచి గద్దింపు వినబడింది.

"వస్తున్నా సార్," అంటూ పరిగెత్తేడు వాడు.

వాన్ కదిలిపోయింది.

శ్రీరామ్‌కి తనమీద తనకే చిరాకు వేసింది. ఛీ! ఎంత వెధవపని చేసాడు. ఆ పెట్టె తెచ్చి ఉండాల్సింది. దాన్నిండా బంగారం ఉందిట. అందుకే అంత బరువుగా వుంది.

మెదడంతా మొద్దుబారిపోయింది. శ్రీరామ్ మళ్ళీ తనను సమర్థించుకున్నాడు. ఒకవేళ ఆ పెట్టెకూడా మోస్తేంటే ఎక్కువదూరం రాలేక పట్టుబడేవాడేమో?

కాలువదగ్గరకు వెళ్ళి పెట్టె తీసుకున్నాడు. వళ్ళంతా చమటపట్టి తడిసిపోయింది. కోట్ తీసి భుజంమీద వేసుకున్నాడు. వేగంగా అడ్డత్రోవన నడుస్తున్నాడు. అతనిలో మునుపటి ధైర్యంలేదు. కాని ఏదో తెగింపు.

శత్రుసేనలు తన కోటను చుట్టుముట్టిన ప్రపంచ విజేత మనఃప్రవృత్తి ఎలా వుంటుందో అతని మనఃప్రవృత్తి

కూడా అలాగే వుంది.

హోటల్ 'హిల్ మెన్' దగ్గిరకి చేరుకున్నాడు. హిల్ మెన్ బ్లూకలర్‌లో నిద్దరోతోంది.

హోటల్‌లోకి ఇప్పుడు వెళితే అందరూ తనని అనుమానిస్తారు. హోటల్ వెనుకభాగం చేరుకుని నీటిగొట్టం పట్టుకుని పైకి ఎగ్రాకి తన రూమ్ బాత్‌రూమ్‌లోకి చేరుకున్నాడు.

బాత్‌రూమ్ తలుపు సందులోంచి చూచాడు.

రేఖ నిద్దరపోతోంది. రేఖని ఎలా నిద్దర లేపాలో అతనికి అర్థంకాలేదు. ఒకవేళ పిలిస్తే ఆమె నిద్దర లేచినా లేవకపోయినా, పక్కరూమ్‌ల వాళ్ళు లేస్తారు. అది మంచిది కాదు.

అతనికి ఒక చక్కని ప్లాన్ తట్టింది. సిగరెట్ వెలిగించాడు.దాన్ని తలుపు సందులో ఇరికించి వేగంగా వేలుతో కొట్టాడు. అది రేఖ మంచానికి ముందుగా పడిపోయింది. ఇలా నాలుగయిదుసార్లు ప్రయత్నిస్తే అది ఫలించింది. సిగరెట్ రేఖమీద పడింది. రేఖ ఉలిక్కిపడి లేచింది.

"నేను శ్రీరామ్‌ని. బాత్‌రూమ్‌లో ఉన్నాను. తలుపు తియ్యి" హెచ్చరించాడు శ్రీరామ్.

రేఖ తలుపు తీసింది.

"ఏంచేశావ్? డబ్బిచ్చేశావా?" ఆత్రుతగా అడిగింది.

"వాణ్ణి చంపేశాను."

"ఎలా చంపేవ్?" అడిగింది రేఖ ఆశ్చర్యంగా.

శ్రీరామ్ బాగా అలసివున్నాడు.

"వివరాలన్నీ తర్వాత చెపుతాను. ముందు నాకు ఏదేనా డ్రింక్ ఇయ్యి" అన్నాడు.

"సారి. జిన్ ఉంది. తీసుకుంటావా!"

"నాకేం అభ్యంతరంలేదు!"

ఒక అరగంటలో శ్రీరామ్ రిలాక్స్ అయ్యాడు. రేఖకి జరిగినదంతా చెప్పేడు. మళ్ళీ ఉత్సాహం వచ్చింది. బట్టలు మార్చుకొన్నాడు.

"ఏమిటి మళ్ళీ ఎక్కడికి ప్రయాణం?" కంగారుగా ప్రశ్నించింది రేఖ.

"సుధాకర్ దగ్గర బహుశా నాకు సంబంధించిన ఫోటోలుకాని, నెగిటివ్‌లుకాని ఉండవచ్చు. వాటిని హస్తగతం చేసుకోకపోతే మనకి ప్రమాదం!"

"నీ ఇష్టం!" ముభావంగా అంది.

శ్రీరామ్ రేఖ దగ్గరగా వెళ్ళి ఆమె మెడచుట్టూ చేతులు వేశాడు.

"డార్లింగ్! నువ్వు నన్ను ఎంకరేజ్ చెయ్యాలికాని, డిస్కరేజ్ చెయ్యకూడదు" అన్నాడు.

"మళ్ళీ ఎంతసేపటిలో వస్తావ్?" గోముగా ప్రశ్నించింది రేఖ.

"వీలయినంత త్వరలో."

"అక్కడికి దేంట్లో వెళతావ్?"

"నడిచే వెళతాను. ఇక్కడికి దగ్గరేలే. నువ్వు నిద్దరోయినా బాత్‌రూం తలుపు మాత్రం తెరిచి ఉంచు" అంటూ శ్రీరామ్ బాత్‌రూంవైపు నడిచేడు.

శ్రీరామ్ వెళ్ళిపోయిన తరువాత రేఖ మరో రెండు పెగ్గుల జిన్ తాగింది. ఆమె కళ్ళు అలసటగా మూత పడ్డాయి. లైట్ ఆర్పి బెడ్ మీద వాలింది.

ఆమెకు శ్రీరామ్ ప్రవర్తనపై అసహ్యం వేసింది.

"దుర్మార్గుడు! డర్టీ ఫెలో!! మనుషుల ప్రాణాలతో చెలగాటా లాడుతున్నాడు. ప్రాణం విలువ తెలియదా రాస్కెల్కి."

రేఖ నిద్రాదేవి ఒడిలోనికి జారిపోయింది.

9

శ్రీరామ్ సుధాకర్ ఇల్లు త్వరగానే కనుక్కున్నాడు. తలుపుకి తాళంవేసి ఉంది. మారు తాళాలతోటి తాళం తీసాడు.

గదంతా దుమ్ము కొట్టుకుపోయి ఉంది. దుమ్ముమీద అనేక అడుగుజాడలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. సుధాకర్ కి ఉన్న నిర్లక్ష్యం ఆ ఇంట్లో ప్రతి వస్తువులోను కన్పిస్తోంది.

ఒకమూలగా ఒక టేబుల్, కుర్చీ ఉన్నాయి. మధ్యగా ఒక చాప, దిండు, రెండు మాసిన దుప్పట్లు ఉన్నాయి. ఒకవారగా తోలుపెట్టె ఉంది.

శ్రీరామ్ ముందుగా దాన్ని సోదాచేశాడు. మూడు జతల బట్టలు, రెండు అండర్ వేర్లు, ఒక బనియన్, ఒక జేబురుమాలు మాత్రమే ఉన్నాయి.

వాటిని క్షుణ్ణంగా పరిశీలించాడు. ఒక చొక్కాలోంచి ఒక కవరు జారిపడింది. శ్రీరామ్ ముఖం టార్చిలైటులా వెలిగింది. మెల్లగా ఆ కవర్ విప్పి చూశాడు. రెండు ఫోటోలు ఉన్నాయి. రెండు కూడా ఎవరో స్త్రీ పురుషులు నగ్నంగాను, అర్ధ నగ్నంగాను వున్నాయి.

'వాడు నన్నేకాకుండా ఇంకా చాలమందినే బ్లాక్ మెయిల్ చేస్తున్నాడన్న మాట,' అనుకున్నాడు.

టేబుల్ మీద రెండు ఆల్బం లున్నాయి. వాటిల్లో చాలామంది స్త్రీ పురుషుల ఫోటోలున్నాయి. శ్రీరామ్ ఆ నెగటివ్ ల్ని పరీక్షించసాగాడు.

అంతలోనే...

"సుధా సుధా" అని ఎవరిదో స్త్రీ కంఠం వినిపించింది.

శ్రీరామ్ కోటు జేబులోంచి కత్తితీసి పట్టుకుని ఎడం

చేత్తో తలుపు తీసాడు.

"ఎప్పుడొచ్చావ్ సుధా! గదిలో లైట్ కనిపిస్తే వచ్చేను. ఇన్నాళ్ళు ఎక్కడ...?" అని తొందరగా మాటాడేస్తున్న ఆ అమ్మాయి, శ్రీరామ్‌ని చూడగానే అరవబోయింది.

"అరవకు చంపేస్తాను" అని బెదిరించాడు శ్రీరామ్.

"నీ పేరేమిటి?"

"సుభద్ర."

"ఇప్పుడు సుధాకర్ వచ్చేడని ఎలాగనుకున్నావ్?" శ్రీరామ్ గొంతుక కఠినంగా ఉంది.

"లైట్ చూసి. మాది పక్కిల్లే" సంజాయిషీ ఇచ్చింది. "నన్ను వదిలెయ్యండి. నేను వెళ్ళిపోతాను. మీ గురించి ఎవరికీ చెప్పను," భయంభయంగా అంది.

"సరే వెళ్ళు!"

ఆమె అడుగు ముందుకేసింది. శ్రీరామ్ కుడిచెయ్యి ఆమె నోరుమూసింది. మరుక్షణం కత్తి వెన్నులో దిగబడింది.

ఆమె నిర్జీవంగా నేలమీద కొరిగిపోయింది.

శ్రీరామ్ ఎడమ చెయ్యి గ్లవుస్ రక్తంతో తడిసి ఎర్రగా ఉంది. ఆమె శరీరంకేసి చూసి నిర్లక్ష్యంగా నవ్వేడు.

అతను ఉలిక్కిపడ్డాడు. అవును తను సుధాకర్ డైరీ గురించి ఆలోచించనే లేదు. దాంట్లో బహుశా, తన రహస్యం ఉండవచ్చు.

డ్రాయర్ సొరుగు తీశాడు. అందులో సుధాకర్ డైరీ ఉంది. తీసి జేబులో వేసుకున్నాడు.

డ్రాయర్‌లో ఉన్న నెగిటివ్‌లని కాల్చేసాడు. గ్లవుసెస్ తీసి జేబులో వేసుకున్నాడు. బయటకు వచ్చి తలుపు

తాళం వేశాడు.

"మిస్టర్ సుధాకర్!" ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు.

"మిస్టర్ సుధాకర్! మీరు రెండునెల్ల అద్దె బాకీ పడ్డారు. ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో తెలియదు. నా అద్దె ఏప్పుడిస్తారు?"

ఆ చీకటిలో ఇంటి యజమాని శ్రీరామ్ సుధాకర్ అనుకుని ఇంకా ఏదో అనబోతున్నాడు.

శ్రీరామ్ జేబులోంచి సైలెన్సర్ తీసి అతడికి గురిచూసి కాల్చాడు.

"కెవ్వు"మని అరుస్తూ అతను నేలగూలాడు.

శ్రీరామ్ చకచకా ముందుకి పరుగెత్తాడు.

10

"యూ డెవిల్! ఎంత పనిచేసావు నువ్వసలు మనిషి వేనా? ఒక ఆడదాన్ని చంపుతావా?" పిచ్చిగా అరిచింది రేఖ.

ఎదురుగుండా శ్రీరామ్ కూర్చుని ఉన్నాడు.

శ్రీరామ్ నిర్లక్ష్యంగా నవ్వేడు.

"శ్రీరామ్ నీకు ప్రాణం విలువ ఎంతో తెలియటంలేదు. దోమల్ని చంపినట్టు మనుషుల్ని చంపేస్తున్నావు. నువ్వు మనిషివి కాదు," అసహ్యంగా అంది రేఖ.

"అవును నేను రాక్షసుణ్ణే" క్రూరంగా నవ్వేడు.

"రేఖా! నేనెన్ని హత్యలుచేసినా నాకేం భయంలేదు. నన్ను ఎవరూ అనుమానించలేరు."

"యు ఆర్ రాంగ్ మిస్టర్ రామ్."

"ఎక్కడ పొరబడుతున్నాను," అసహనంగా అరిచాడు శ్రీరామ్.

"రామ్! నువ్వేదో చాలా తెలివైన వాడివనుకుంటు

న్నావ్. కాని నిన్ను దోషిగా నిరూపించే సాక్ష్యాలు చాలా వదిలేశావు!"

"ఏమిటవి?"

"రామ్ నువ్వు వేణు ఇల్లు సోదా చెయ్యలేదు. నువ్వు రామచంద్రాన్ని హత్యచేస్తున్న ఫోటోలు అతని దగ్గర ఉండవచ్చు."

శ్రీరామ్ ముఖం పాలిపోయింది. శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాడు.

"రేఖా! నువ్వు చెప్పింది నిజమే నేను చాలా తప్పటడుగులు వేశాను. నేను పోలీసులకి కనపడకుండా వెళ్ళిపోతాను. డబ్బు చెరిసగం పంచుకొని ఎవరిదారిన వాళ్ళం వెళ్ళిపోదాం!"

రేఖ వ్యంగ్యంగా నవ్వింది.

"ప్లీజ్ రేఖా! నా వాటా నా కిచ్చేయి. నేను వెళ్ళిపోతాను."

"మిస్టర్ శ్రీరామ్! నీకొక్క చిల్లిగవ్వకూడా ఇవ్వను. అంతకీ పట్టుబడితే పోలీసులకి రిపోర్టిస్తాను..బి కేర్ ఫుల్. నువ్వు వేణు దగ్గర్నుంచి తెచ్చిన ఫోటోలు నా దగ్గర ఉన్నాయి. నువ్వు ఇక్కణ్ణించి వెళ్ళిపో!"అంటూ రివ్వున బయటకు వెళ్ళిపోయింది రేఖ.

శ్రీరామ్ అచేతనుడయిపోయాడు. బుర్ర పనిచేయడం లేదు. 'అనాలోచితంగా చేసిన ఒక హత్య అనేక హత్యలకు దారి తీస్తుంది' అన్న సూక్తి తనపట్ల పూర్తిగా నిజమయ్యింది.

తనెంత పొరపాటుచేశాడు! ఏ డబ్బుకోసమైతే తనిన్ని హత్యలు చేసాడో అది తనకి దక్కటంలేదు.

'అలా జరగకూడదు' అనుకున్నాడు శ్రీరామ్.

తల తిరిగిపోతోంది. ఏం చెయ్యాలి? ఇప్పుడేం చెయ్యాలి.

రేఖ అలా చేస్తుందని అతడు కలలో కూడా వూహించ లేదు.

టాక్సీని పిలిచి హోటల్ చంచల్ కి పోనివ్వమన్నాడు.

హోటల్ లో రూమ్ తీసుకొని ఆలోచించడం మొదలు పెట్టాడు. ఏంచెయ్యాలి? పోనీ రేఖని బ్రతిమాలితే? అదే మంచి పని అనుకున్నాడు. హిల్ మెన్ కి ఫోన్ చేసి రూమ్ వన్ సిక్స్టీన్ కి కనెక్ట్ చెయ్యమన్నాడు.

రేఖ ఫోన్ ఎత్తి "హలో!" అంది.

"హలో రేఖా!"

"ఎందుకు ఫోన్ చేశావ్?" చిరాగ్గా వుంది రేఖ కంఠం.

"పోనీ నాకొక లక్షరూపాయలు...?"

"పటప్!" ఫోను పెట్టేసింది.

"రేఖా!" పళ్ళు పటపట కొరికాడు శ్రీరామ్.

'ఈ రాత్రితో నీ పని సఫా!' అనుకున్నాడు.

అవును. ఈ రాత్రికే రేఖని హత్యచేసి ఆ డబ్బుతో పారిపోవాలి!

అదే అతని ఊహ.

11

రాత్రి పదిగంటలయింది. నగరంలో జనసంచారం పల్చబడింది.

శ్రీరామ్ హోటల్ చంచల్ నుండి బయటకు వచ్చాడు. దగ్గరలో ఉన్న కిళ్ళీకొట్టు దగ్గరకెళ్ళి విల్స్ సిగరెట్ పాకెట్ కొన్నాడు. సిగరెట్ వెలిగించి బస్ స్టాప్ దగ్గరకు నడిచేడు.

ఇప్పటికే తను చాలా తప్పులు చేసాడు. ఇంకముందరైనా జాగర్తగా ఉండాలి అనుకున్నాడు. అందుకే అతను టాక్సీ ఎక్కలేదు. అలా వెళ్తే టాక్సీవాడి ద్వారా తన ఆచూకి తెలిసిపోవచ్చు.

రెండుమూడు బస్సులు వచ్చివెళ్ళాయి. తర్వాత అతనికి కావలసిన బస్సు వచ్చింది. శ్రీరామ్ సిటీ బస్సు ఎక్కాడు. బస్ వేగంగా పోతోంది. జనం పల్చగా ఉన్నారు.

"హలో మిస్టర్ శ్రీరామ్" ఎవరిదో కంఠం వినిపించింది. తనని కాదేమో అనిపించింది. ఒకవేళ తననే అయినా వెనకకి తిరగకూడదు.

"హలో మిస్టర్ రామ్! హౌడుయూడూ" ఎవరిదో చెయ్యి భుజంమీద పడింది.

పాములు పాకినట్టనిపించింది శ్రీరామ్‌కి. వెనక్కి తిరిగాడు. అతని వయస్సు ముప్పై సంవత్సరాలుంటాయి. ఎర్రగా బొద్దుగా ఉన్నాడు. తలకి గోధుమ రంగు మఫ్లర్.

"నన్ను గుర్తుపట్టలేదా?" నవ్వుతూ అడిగాడు.

"ఐయాం సారీ మీరెవరో నాకు తెలియదు. నాపేరు శ్రీరామ్ కాదు," అన్నాడు శ్రీరామ్ కంగారుగా.

"ఓహ్!" నవ్వేడతను. ఆ నవ్వుచూస్తే శ్రీరామ్‌కి భయంవేసింది. చలిజ్వరం వచ్చినవాడిలా వణికాడు.

బస్ ఆగింది. ఆ వ్యక్తి దిగిపోయాడు.

శ్రీరామ్ గుండెలనిండా గాలి పీల్చుకుని సిగరెట్ ముట్టించాడు.

శ్రీరామ్ బస్ దిగేటప్పటికి అతనికి చాలా దాహంగా ఉంది. డ్రింక్ తాగుదామనుకుని మరుక్షణం ఆ ఊహని ఉపసంహరించుకున్నాడు. చిన్న సాక్ష్యంకూడ వదలకూడదు. అది అతని అభిప్రాయం.

శ్రీరామ్ తిన్నగా రేఖ రూమ్‌కి వెళ్ళాడు. తలుపు లోపలగడియ వేసివుంది. శ్రీరామ్ ఒక చాలా సన్నని ఇనుపరేకు తీసి తలుపుసందులోంచి బలంగా పైకి నెట్టాడు. తలుపు తెరుచుకుంది. తలుపు దగ్గరగా పెట్టాడు. గదంతా చిమ్మచీకటి. బాటరీలైటు వెలిగించి చెయ్యి అడ్డం

పెట్టాడు. వేళ్ళసందుల్లోంచి కాంతి ప్రసరిస్తోంది. రేఖ మంచం మీద పడుకుని ఉంది. పిస్టల్ తీసి గురి చూసాడు....

లైటు వెలిగింది!

గదంతా పాలనురగలాంటి వెలుతురు!!

"వెల్ మిస్టర్ రామ్! పిస్టల్ క్రింద పడెయ్యి!" అది రేఖ కంఠం.

శ్రీరామ్ ఉలిక్కిపడ్డాడు. పిస్టల్ వదిలేసి నెమ్మదిగా వెనక్కి తిరిగాడు. రేఖ పిస్టల్ పట్టుకుని ఉంది.

ఆమె నవ్వుతోంది.

"నాకు తెలుసు శ్రీరామ్. ప్రాణం విలువ తెలియని నువ్వు నా ప్రాణం తియ్యడానికి ప్రయత్నిస్తావని. అందుకే నేను బాత్ రూమ్‌లో ఉండి నా పెట్టెలు మంచంమీద పెట్టి దుప్పటి కప్పాను.

శ్రీరామ్ ఈ సారికి నిన్ను క్షమిస్తున్నాను. ఇంకెప్పుడు నాకు కనిపించకు. రేపటికల్లా ఊరెళ్ళిపో. లేకపోతే నిన్ను పోలీసులకి పట్టిస్తాను. బి కేర్."

"రేఖా ప్లీజ్ ఒక లక్షరూపాయి లియ్యి. నా దారిన పోతాను."

రేఖ వికటంగా నవ్వింది. "లక్షరూపాయిలు లేదు లక్ష పైసలుకూడా ఇవ్వను, గెటవుట్!" అరిచింది.

శ్రీరామ్ మౌనంగా బయటకి వచ్చేశాడు.

12

సముద్రపు అలలు తీరాన్ని ఢీ కొంటున్నాయి. బీచిలో జనం ఎక్కువగా లేరు.

శ్రీరామ్ ఒకమూల ఇసుకపై వెల్లకింతలా పడుకుని వున్నాడు. అతని బుర్ర తీవ్రంగా పనిచేస్తోంది. అతనిలో నిరాశ పేరుకొని పోయింది.

రేఖను నిన్న చంపడానికి ప్రయత్నించి విఫలు డయ్యాడు. ఈవేళ నుంచీ కట్టుదిట్టంగా వుంటుంది.

పోలీసులు కూడా ఈపాటికి ఆనగురించి వేట ప్రారంభించి వుంటారు. ఏం చెయ్యాలి? ఆత్మహత్య ఒక్కటే శరణ్యం మనిపిస్తోంది శ్రీరామ్‌కి.

"హలో మిస్టర్ ర్యామ్!"

శ్రీరామ్ ఉలిక్కిపడ్డాడు. నిన్న బస్సులో పలకరించిన వ్యక్తి. అతను శ్రీరామ్‌కి నాలుగడుగుల దూరంలో నిల్చుని వున్నాడు.

"మిస్టర్ రామ్!" మళ్ళీ పిలిచాడతను. ఈసారి అతని కంఠంలో నవ్వు వినిపించింది.

"మీరెవరో నాకు తెలియదు. నా పేరు శ్రీరామ్ కాదు. మీరు నిన్నా ఆ పేరుతోనే సంబోధించారు."

"తొందరపడకు మిస్టర్ రామ్. తరువాత బాధపడతావు. నేనెవరో నీకు తెలియకపోయినా నీవు నాకు పరిచితుడివే."

"ఎలాగ?"

"ఫోటో ద్వారా"

"ఏ ఫోటో ద్వారా?" కంగారుగా అడిగాడు శ్రీరామ్.

"లక్షాధికారి రామచంద్రం గుండెల్లో నీ కత్తి కసుక్కున దిగిన ఫోటో."

శ్రీరామ్‌కి మతిపోయిన ట్లనిపించింది.

"చూపించమంటావా?"

"అక్కర్లేదు పూర్వ మొకసారి చూసా!"

శ్రీరామ్‌లో మొండిధైర్యం ప్రవేశించింది.

"అది నీకు చాలా ప్రమాదకరమైనది!"

"ఫర్వాలేదు. పోలీసులకి పంపు. లేదా పేపర్లు కొట్టించి అమ్ముకో."

"ఆవేశపడకు శ్రీరామ్. నువ్వు రామచంద్రం. ఇనప్పెట్టెలోంచి ఐదులక్షలు దొంగిలించేవు. అందులో నాకు రెండులక్ష లియ్యి, నాదారిన నే వెళ్ళిపోతాను."

"రెండులక్షలా! హహహా!!" బిగ్గరగా నవ్వేశాడు శ్రీరామ్.

"మిస్టర్ రామ్!" కంగారుగా పిలిచాడా వ్యక్తి.

"నా దగ్గర రెండులక్షలు లేదు గదా, రెండు పైసలు కూడా లేవు. నా పార్ట్నర్ నన్ను మోసగించింది మిస్టర్!"

"వరదన్."

"మిస్టర్ వరదన్ నీకు నిజంగా రెండు లక్షలు కావాలా? అయితే ఒక ఉపాయం వుంది."

"ఏమిటది?" వరదన్ చటుక్కున ముందుకి వంగాడు.

"చెప్తాను. కాని ముందు నీ గురించి నాకు కొంత ఇన్ఫర్మేషన్ కావాలి. నీ గురించి నేను విపులంగా తెలుసుకోవాలి."

"సర్టెన్లీ, నాకు ఈ కేసుకి వున్న సంబంధం గురించి చెపుతాను.

"నాపేరు వరదన్. స్టూడియో చిత్ర ఓనర్ని. బ్లాక్ మెయిలర్స్ అందరూ ఫోటోలు నా దగ్గిరే డెవలప్ చేయించుకుంటారు. వేణు నేను స్నేహితులం.

ఒకరోజు వేణు నా దగ్గరకి వచ్చి నా సహాయం కోరాడు. ఏమి టన్నాను. మీరిలా దొంగతనం చెయ్యబోతున్నట్టు చెప్పి, దొంగతనం చేస్తున్నట్టు ఫోటోలు తీయమన్నాడు. వాటి సహాయంతో మిమ్మల్ని బ్లాక్ మెయిల్ చెయ్యొచ్చనీ, దానిద్వారా డబ్బు సంపాదించ వచ్చనీ, నాకు సగం వాటా ఇస్తానన్నాడు.

నే నప్పుడు ఇంకో ఉపాయం చెప్పాను. అదేమిటంటే రామచంద్రానికి మత్తుపదార్థం ఆహారంలో కలపవద్దని చెప్పాను. ఏదో ఓ విధంగా రామచంద్రానికి మెలుకువ వచ్చి నిన్ను చూస్తాడని అతన్నించి తప్పించుకోవడానికి నువ్వు చంపుతావని ఊహించాను. హత్య చేస్తున్నట్టు ఫొటో తీసేస్తే మాకింకా లాభం! వేణూ నాతో ఏకీభవించాడు.

వేణూ అన్నంలో మత్తుపదార్థం కలుపలేదు. రామచంద్రం నిద్రలో వుంటాడని ఊహించిన నువ్వు ధైర్యంగా దొంగతనం చెయ్యబోయావు. నేను కావాలని పెద్ద శబ్దం చేశాను! రామచంద్రం లేచాడు. స్ప్రింగ్ రూమ్‌లో అలికిడి అవటంతో అక్కడకు వచ్చి నిన్ను చూసాడు. ఆ తరువాత సంగతి నీకు తెలిసినదే!

కొన్ని ఫోటో ప్రింటులు నా దగ్గర వుంచుకుని మిగిలినవి వేణు కిచ్చాను. ఆ సంగతి వేణుకు తెలియదు. అయితే నాలో మరో ఊహ కదిలింది. ఒకవేళ వేణూని నేను బ్లాక్ మెయిల్ చేసి వాడిదగ్గర్నించి అంత డబ్బు లాగితే? అందుకే వేణూని అనుసరించి ఫొటోలు తీయమని నా అసిస్టెంటు సుధాకర్‌ని పంపేను. తర్వాత నీకు తెలిసిందే.''

శ్రీరామ్ తల పంకించాడు.

''మిస్టర్ వరదన్! రేఖ దగ్గిర ఐదులక్షల రూపాయిలున్నాయి. వాటిని మనం రేఖ బ్రతికి ఉండగా పొందలేం!''

''రేఖ ఎక్కడ వుంటోంది?'' చటుక్కున ప్రశ్నించాడు వరదన్.

''చెప్పతానుండు. రేఖ షీలా అనే పేరుతో హోటల్ హిల్ మెన్‌లో వుంటోంది. రూమ్ నెంబర్ 116. నువ్వు ఆమెని ఎలాగైనా హత్య చెయ్యాలి. ఆమె డబ్బు ఎక్కడ

దాచిందో నాకు తెలుసు. ఆ హత్య చేస్తే నీకు రెండు లక్షలు వస్తాయి."

శ్రీరామ్ ఒక్క విషయం మాత్రం అబద్ధం చెప్పాడు. అదేమిటంటే రేఖ డబ్బు ఎక్కడ వుందో తనకు తెలుసని. నిజానికి అది అతనికి తెలియదు.

"మిస్టర్ రామ్! మనిద్దరి మధ్యన అరమరికలు ఉండకూడదు. అందుకని కొన్ని ప్రశ్నలు వేస్తాను."

శ్రీరామ్ అడగమన్నట్టు తల ఊపేడు.

"రామచంద్రం స్ట్రాంగ్ రూమ్ రహస్యం మీకు ఎలా తెలుసు?

"రేఖ సంపాదించింది. రామచంద్రం కూతురితో బాగా స్నేహం చేసి రామచంద్రం డైరీ చేజిక్కించుకుంది. దాంట్లో ఐరన్ సేఫ్ తాళంయొక్క ఈక్వేషన్ వుంది."

"నువ్వు ఎన్ని హత్యలు చేసావ్!"

"మూడు."

"ఎవరెవర్ని."

"రామచంద్రం, వేణు, సుధాకర్."

"అబద్ధమాడకు, ఒక స్మగ్లర్‌ను, సుధాకర్ ప్రియురాలు సుచిత్రను, అతడుంటే యింటి యజమానిని కూడా చంపావు."

శ్రీరామ్ మాట్లాడలేదు.

"రేఖని నువ్వే చంపకుండా ఆ పని నాకెందు కప్పగించావ్?" సూటిగా అడిగాడు వరదన్.

"నేను నిన్న రేఖని చంపడానికి ప్రయత్నించి విఫలమయ్యాను. అందువల్ల రేఖ నానుండి జాగ్రత్తగా వుంటుంది. అంతేకాకుండా నాకిప్పుడో మనిషిని చంపే ధైర్యం లేదు."

"గుడ్ నేనింక వెళతాను. ఏ విషయం నీకు త్వరలోనే చెపుతాను."

13

"రూం నెంబర్ వన్ ట్వెంటీ ఫైవ్" అన్నాడు తాళాలు అందిస్తూ.

వరదన్ రూమ్‌కి వచ్చి స్నానంచేసి బట్టలేసుకుని మేనేజర్‌కి ఫోన్ చేసి, బోయ్‌ని పంపమన్నాడు.

ఐదు నిముషాల్లో వాడు వచ్చాడు. వాడికి పధ్నాలుగు సంవత్సరాలుంటాయి.

మెనూకార్డ్ చూసి ఏదో రెండు స్వీట్స్ ఆర్డర్ చేశాడు. స్వీట్స్ వచ్చాయి.

"అలా కూర్చోవోయ్" అన్నాడు వరదన్ కుర్చీ చూపిస్తూ. కాని వాడు కూర్చోలేదు.

"ఫర్వాలేదు కూర్చోవోయ్" అన్నాడు నవ్వుతూ. టిఫిన్ తిన్న తరువాత వాడికో అయిదు రూపాయిలిచ్చాడు.

"నాకొక సహాయం చెయ్యాలి."

"ఏమిటి సార్!" అన్నాడు వాడు ఉత్సాహంగా.

"నీకు రూమ్ నెంబర్ వన్ సిక్స్‌టీన్‌లో ఉన్న ఆవిడ తెలుసా?"

వాడు తెలుసు నన్నట్టు తల ఊపాడు.

"ఆవిడ ఎప్పుడేనా కాఫీ ఆర్డర్ చేస్తే ఈ పొట్లం కాఫీలో కలుపు. వెంటనే వచ్చి నాకు చెప్పు" అంటూ చిన్న పొట్లం, పదిరూపాయిల నోటు ఇచ్చాడు. వాడు అనుమానంగా వరదన్‌ని చూశాడు.

వాడి అనుమానం గ్రహించి "అదేం విషం కాదులేవోయ్. ఓ గంట మత్తు కలిగిస్తుంది" చెప్పాడు వరదన్.

"అలాగే సార్!"

వాడు నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

14

రేఖ కళ్ళు తెరిచింది. ఏమిటి? తనిలా పడుకుంది? ఏం జరిగింది?

తల తిప్పి చూసింది. ఎవడో కూర్చుని ఉన్నాడు. రేఖని చూడగానే చిన్నగా నవ్వేడు.

"మిస్ రేఖా!"

రేఖ మాట్లాడలేదు.

"మిమ్మల్నే రేఖా!"

"ఎవరు మీరు? ఇక్కడెందుకున్నారు? నా పేరు రేఖ కాదు" అంది కంగారుగా.

"కంగారు పడకు రేఖ! నీ గురించి నాకంతా తెలుసు."

"ఏమిటి తెలుసు! పిచ్చివాగుడు వాగకు. ముందు ఇక్కడనుంచి ఫో," అరిచింది రేఖ.

"నీ దగ్గరున్న ఐదు లక్షల గురించి."

రేఖకు పిచ్చెక్కినట్లనిపించింది. అసలు తనెందుకు ఇలా పడుకుంది? రేపు ఇక్కణ్ణించి వెళ్ళిపోదామనుకొంటూంటే ఇంతలో వీడెవడు శనిలా దాపురించాడు.

"రేఖా! కావాలంటే నేనిప్పుడు నిన్ను చంపెయ్యగలను."

అతని చేతిలో రివాల్వర్ తళతళ లాడుతోంది. రేఖ వంటినిండా చెమటలు పట్టేసింది.

"ఎవరు నువ్వు?"

"చెప్తాను. నా పేరు వరదన్. ఫోటోగ్రాఫర్ని. రామచంద్రం హత్య ఫోటో నేనే తీసాను."

"నీకేం కావాలి? నన్నెందుకు బెదిరిస్తున్నావ్?" రేఖ పెదాలు వణుకుతున్నాయి.

"డబ్బు!" వికటంగా నవ్వేడు వరదన్.

"ఏ డబ్బుకోసం నువ్వు, శ్రీరామ్ కక్కుర్తిపడ్డారో, ఆ డబ్బు" మరోసారి నవ్వేడు.

"నా దగ్గర లేదు."

"మరెక్కడుంది?"

"శ్రీరామ్ దగ్గర."

వరదన్ మళ్ళీ నవ్వేడు.

"నువ్వలా కాలయాపన చేస్తే చంపెయ్యాల్సొస్తుంది."

రేఖ నోరు తడారి పోయింది.

"నన్ను నమ్ము," ప్రాధేయపూర్వకంగా అంది.

"పిచ్చి పిచ్చి కబుర్లు చెప్పకు రేఖా! నేను శ్రీరామ్ దగ్గిర్నుంచే వచ్చేను."

"అయితే?" ఏం తెలీనట్లు అడిగింది.

"ఏం తెలీనట్టు మాట్లాడకు రేఖా! నాకు చిరాకు ఎక్కువ. నీ దగ్గిర డబ్బుందని శ్రీరామ్ చెప్పాడు."

"శ్రీరామ్ నీకు అబద్ధం చెప్పాడు."

వరదన్ నవ్వేడు.

"ఎందుకలా నవ్వుతావు,"కోపంగా ప్రశ్నించింది రేఖ.

"నువ్వు నన్నే మభ్యపెట్టాలని చూస్తుంటే నవ్వొస్తోంది."

"శ్రీరామ్ నీకు అబద్ధం చెప్పలేదని ఎందుకనుకుంటున్నావు?"

"రేఖా! ప్రతి మనిషి ప్రాణానికి అన్నిటికంటె ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాడు. ప్రాణం తీపి అటువంటిది. ప్రాణం విలువ వెలలేనిది. కాని శ్రీరామ్ ప్రాణం వది లెయ్యటానికి సిద్ధపడ్డాడు. దాన్నిబట్టి శ్రీరామ్ దగ్గిర డబ్బు లేదని తెలుసుకున్నాను."

రేఖ మాట్లాడలేదు.

"రేఖా నేను చాలా ఆలస్యం చేస్తున్నాను కదూ!"

"దేనికి?"

"నిన్ను చంపడానికి."

రేఖ మాట్లాడలేదు.

"నీకు బ్రతకాలని ఉందా!" కరుగ్గా ఉంది వరదన్ కంఠం.

రేఖ ఉందన్నట్టుగా తల ఊపింది.

"గుడ్! అయితే రెండు లక్షలు ఇయ్యి, నిన్ను వది లేస్తాను."

"రెండు లక్షలా! ఒక లక్షిస్తాను."

"వద్దు నీ దగ్గరే ఉంచుకో. శ్రీరామ్ నిన్ను చంపితే నాకు రెండు లక్షలిస్తా నన్నాడు."

"పోనీ నేనే ఇస్తాను ఆ డబ్బు!"

"దట్స్ గుడ్."

"నీ పేరు?"

"వరదన్!"

"మిస్టర్ వరదన్, మనం డబ్బు పంచుకున్నంతతో సరిపోదు. శ్రీరామ్ మనల్ని వదలడు కాబట్టి శ్రీరామ్‌ని మన దారినుండి తప్పించాలి."

"యూ ఆర్ కరెక్ట్! నేను అదే చెబ్దామనుకుంటు న్నాను. శ్రీరామ్‌ని సులభంగా మన దారిలోంచి తప్పించ వచ్చు," అన్నాడు వరదన్.

"నో నేను ఒప్పుకోను. శ్రీరామ్ చాలా తెలివైన వాడు. ఏదైనా పొరపాటు జరిగితే మన ప్రాణానికే నష్టం!"

"అది ఇదివరకటి శ్రీరామ్. ఇప్పుడు శ్రీరామ్ బుర్ర చెద పట్టి పోయింది. నువ్వు మోసం చెయ్యడంతో మతి పోయింది" అన్నాడు తాపీగా.

"అయితే శ్రీరామ్‌ని ఎలా హత్య చెయ్యచ్చు? శవం

మాయం చెయ్యడం ఎలా?"

"నువ్వు తొందర పడకు అన్నీ చెపుతాను. రేపురాత్రి నువ్వు శ్రీరామ్‌కి ఫోన్ చేసి మనసు మార్చుకున్నానని, ఇద్దరం కలిసి ఉండచ్చు రమ్మనమను. రాగానే పక్కనే ఉన్న పల్లెటూరికి వెళ్ళిపోదామని చెప్పు. నేనిక్కడ మారువేషంలో టాక్సీ డ్రైవరుగా క్రింద ఉంటాను. మీరు నా టాక్సీలో ఎక్కుతారు. కొద్ది దూరం వెళ్ళిన తరువాత నేను శ్రీరామ్‌ని కత్తితో పొడుస్తాను. తర్వాత మనం కారుని యీ కొండపైనుండి శవంతో పాటు లోయలోకి తోసెయ్యచ్చు."

"గుడ్ ప్లాన్!"

15

"రేఖా" అంటూ వచ్చి శ్రీరామ్ ఆమె భుజాన్ని నొక్కాడు.

"నాకు తెలుసు రేఖా! నువ్వు చాలా మంచిదానివని," అంటూ ముద్దెట్టుకోబోయాడు.

"ఉష్! ఏమిటా పని. మనం త్వరగా ఇక్కడనుంచి పక్క ఊరు వెళ్ళిపోవాలి. టాక్సీ పిలు!" అంది.

అంతట్లోకే వరదన్ టాక్సీ వచ్చి పక్కగా ఆగింది.

"టాక్సీ కావాలా సార్!"

"అవును. ప్రక్క ఊరికి వస్తావా?"

"ఎక్కండి."

శ్రీరామ్ బాక్‌డోర్ తియ్యబోయాడు.

"ఫ్రంట్ సీట్లో కూర్చోండి సార్. బాక్‌సీట్ బాగా లేదు," అన్నాడు డ్రైవర్.

వరదన్ పక్కన శ్రీరామ్, అతని పక్కన రేఖ కూర్చున్నారు. శ్రీరామ్ మారువేషంలో వున్న వరదన్‌ని గుర్తు

పట్టలేదు. టాక్సీ 'హిల్ మెన్' దాటి కొంతదూరం వచ్చింది.

"సార్! సీటుక్రింద ఏదో వున్నట్టుంది. చూడండి," అన్నాడు వరదన్.

శ్రీరామ్ క్రిందికి చూడడానికి వంగాడు. మరుక్షణం... వరదన్ చేతిలోని కత్తి శ్రీరామ్ వీపులో దిగబడింది.

"అమ్మా!" పిచ్చిగా అరిచాడు శ్రీరామ్.

మరొకసారి పొడిచాడు వరదన్.

"చచ్చేడు," అన్నాడు వరదన్.

"వెల్ డన్" అంది రేఖ మెచ్చుకోలుగా.

శవం సీటుక్రిందకి జారుకుంది.

రేఖ క్రిందకు వంగింది.

"ఎందుకు?" అడిగాడు వరదన్.

"చూస్తున్నాను."

"ఏమిటి?"

"రక్తం వేడిగా ఉంది."

పెదగా నవ్వేడు వరదన్. మరుక్షణం కెవ్వుమన్నాడు. ఏ కత్తితోటి శ్రీరామ్ని పొడిచాడో ఆ కత్తే అతని గుండెల్లో దిగేసింది రేఖ. కసిదీరా పొడిచింది.

"ఇడియట్! మూడులక్షలు కావాలా?చావు!! మూడు కాదు ముప్పైసార్లు చావు" పిచ్చిగా అరుస్తోంది రేఖ.

స్టీరింగ్ వీల్ ముందు కూర్చుంది.

ఏక్సిలేటర్ బలంగా నొక్కింది. నిర్మానుష్యమైన రోడ్డు మీద, చిక్కటి చీకటిలో కొండ మలుపులు తిరుగుతూ కారు దూసుకుపోతోంది.

రేఖకు ఇప్పుడు చాలా సంతోషంగా వుంది. ఇక తన స్వేచ్ఛకు అడ్డంకులు ఏవీ లేవు. ఆ డబ్బుతో తను జీవి

తాంతం హాయిగా బ్రతకగలదు. మనస్సంతా ఊహాలలో తేలిపోసాగింది.

ఎదురుగా ఓ లారీ వేగంతో రాసాగింది. రేఖ కారు స్పీడు తగ్గించడానికి బ్రేకులు వేయసాగింది. కాని అవి పని చేయటంలేదు. కారు స్పీడు తగ్గలేదు. పైగా డౌన్ లో కారు మరింత స్పీడుగా వెళ్ళసాగింది.

లారీ దగ్గరైంది. రేఖకు చెమటలు పట్టసాగాయి.

నేర్పుగా ప్రక్కకు కోసి లారీని దాటింది. కాని అంత లోనే కారు తాగినవాడికి మల్లే మెలికలుగా తిరిగి ప్రక్కనున్న లోయలోకి పడిపోయింది.

ఎర్రని మంటలు భగ్గున లేచాయి. ఆ మంటలలో రేఖ సజీవంగానే దహనమైపోసాగింది. ఆమె ఆర్తనాదాలు కొద్దిసేపు ఆ చీకటిలో ప్రతిధ్వనించి ఆగిపోయాయి.

మొత్తం తొమ్మిదిమందిని బలితీసుకొన్న ఆ అయిదు లక్షలు కూడా ఆ మంటలలో మసి అయిపోయాయి.

—: ఐ పో యిం ది :—